నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | SIDDIPET

హాకీంపేట గ్రామశివారులో ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8: నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బీ.అనురాధ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లాలో 7 కేంద్రాలు ఎంపికయ్యాయని, సెంటర్ నుంచి 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడ వద్దని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పరీక్ష జరిగే సమయంలో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సెయింట్ మేరీస్ విద్యానికేతన్, ప్రజ్ఞాపూర్, సెయింట్ జోసెఫ్ గర్ల్స్ హైస్కూల్, గజ్వేల్, తెలంగాణ మోడల్ స్కూల్ సంగాపూర్ రోడ్ గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్, గజ్వేల్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్, గజ్వేల్, గవర్నమెంట్ హైస్కూల్ బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్, గజ్వేల్, జిల్లా పరిషత్ హైస్కూల్ బాయ్స్, ప్రజ్ఞాపూర్, జవహర్ నవోదయ విద్యాలయం, వర్గల్‌లో పరీక్షా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఒక గంట ముందే చేరుకొని, మానసిక ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

ఈ ఏడాది ఐదువేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు చర్యలు

- రైతులకు అవగాహన కల్పించాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా
- వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో పంటల పరిశీలన

వెల్దుర్తి, ఫిబ్రవరి 8: మెదక్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. గురువారం మాసాయిపేట, వెల్దుర్తి మండలాల పరిధిలోని హాకీంపేట, ఉప్పలింగాపూర్ గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్ని ఎకరాల్లో పంట సాగవుతుంది, రాయితీ ఎంత, ఎంతమంది సాగు చేస్తున్నారు, పరిశ్రమ ఏర్పాటు పనులతో పాటు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో తిరిగి మొక్కలు, అంతర పంటలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఐదువేల ఎకరాల్లో సాగు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 300 ఎకరాల్లో సాగు అవుతుందని, మార్చి నాటికి మరో 500 ఎకరాల్లో పంట వేయనున్నట్లు వివరించారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సన్న, చిన్నకారు రైతులకు ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించాలని, మరింత మంది ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో లివింగ్ ఫుడ్ అనే పరిశ్రమతో కలిసి పనిచేస్తున్నామని, పరిశ్రమ వారు మొక్కలను ఇవ్వడమే కాకుండా పంటను కొనుగోలు చేస్తారన్నారని, సాగును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు అండగా నిలుస్తారని తెలిపారు. హార్టికల్చర్ జిల్లా అధికారి నరసయ్య మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో 57 మొక్కలు, మొక్కకు, మొక్కకు మధ్య తొమ్మిది మీటర్ల దూరంతో పంటను వేసుకోవాలన్నారు. ఒక్కో మొక్కకు రూ. 20 చొప్పున రూ. 1140 చెల్లించాలని, డ్రిప్‌నకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ కాగా, ఇతరులకు 90 శాతం రాయితీ ఉంటుందన్నారు. మొత్తంగా ఎకరం సాగుకు ప్రభుత్వం రూ. 50వేల రాయితీ ఇస్తుందని, ఇందులో డ్రిప్‌నకు రూ. 22,518, మొక్కలకు రూ.11,600, సంవత్సరానికి రూ. 4,200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ. 16,800లను ఎరువులు, సాగు ఖర్చుల కోసం అందిస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత ఐదో ఏట నుంచి దిగుబడి పెరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత హార్టికల్చర్, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, నర్సాపూర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి రామకృష్ణ, లివింగ్ ఫుడ్ పరిశ్రమ ప్రతినిధి కృష్ణ, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, ఎంపీడీవో వెంకటలక్షమ్మ, ఏవో రాజశేఖర్‌తో పాటు పలువురు అధికారులు, రైతులు ఉన్నారు.

మల్లన్న ఆదాయానికి గండి!

వివాదాలకు నిలయంగా కొమురవెల్లి మల్లన్న ఆలయం

- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న దర్శనం పాస్‌లు
- అడ్డదారిలో పాస్‌ల విక్రయాలు
- ఇటీవల ఐదుగురుపై కేసులు నమోదు
- ఉత్సవాల వేళ లోపాలతో భక్తుల ఇక్కట్లు

చేర్యాల, ఫిబ్రవరి 8: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆదాయానికి గండిపడుతున్నది. కొందరు అక్రమంగా పాస్‌లు విక్రయిస్తూ ఆలయానికి రావాల్సిన ఆదాయాన్ని సొంతజేబుల్లోకి మళ్లించుకుంటున్నారు. భక్తులు వీఐపీ దర్శనానికి రూ.500, శీఘ్రదర్శనానికి రూ.150 చొప్పున కౌంటర్ వద్ద టికెట్ కొనుగోలు చేసి దర్శనం చేసుకుంటారు. దాతలు, ఆలయ అభివృద్ధికి పాటుపడే వారికి మాత్రం ఆలయవర్గాలు దర్శనం పాసులు ఇస్తుంటాయి. ఈ పాస్‌లు కొందరికి ఆదాయమార్గంగా మారాయి. ఇటీవల బ్రహ్మోత్సవాల మూడో ఆదివారం ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ, కమిటీ సభ్యులు నిర్వహించిన తనిఖీల్లో కొమురవెల్లికి చెందిన ఐదురుగు వ్యక్తులు అక్రమంగా టికెట్లు విక్రయిస్తూ పట్టుబడ్డారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు చీటింగ్ చేసు నమోదు చేశారు. కాగా, ఈ తతంగంలో ఆలయానికి చెందిన ఓ ద్వితీయశ్రేణి అధికారి హస్తం ఉందనే ఆరోపణలు వచ్చాయి. కాగా, ఆ అధికారి మాత్రం ఈ ఘటనపై తనకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించినట్లు తెలిసింది. ఆలయంలో విధులు నిర్వహించే తృతీయ శ్రేణి సిబ్బంది ఒకరికి కొన్ని పాస్‌లు ఇచ్చానని, పోలీసులకు పట్టుబడ్డ వారికి ఆయనే ఆ పాసులు ఇచ్చారని, తనపై ఆరోపణలు సరికావని సదరు అధికారి వెల్లడించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పాస్‌ల జారీ కఠినతరం చేయాలని ఆలయ వర్గాలు నిర్ణయానికి వచ్చాయని, దానికోసం ప్రత్యేక మార్గదర్శకాలు తయారు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో దర్శనం తదితర టికెట్లను సర్కిలింగ్ చేసి పలువురు వలంటీర్లు, తాత్కాలిక సిబ్బంది అడ్డంగా దొరికిపోయి కేసులు పాలై ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. మళ్లీ ఇటీవల టికెట్ల అక్రమ విక్రయాలు వెలుగుచూశాయి.

వివాదాస్పదంగా నిర్ణయాలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వివాదాలకు నిలయంగా మారుతుండడంతో క్షేత్ర ప్రతిష్ట మసకబారుతున్నది. స్వామివారి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఎన్నడూ లేనివిధంగా ఈసారి సిద్దిపేట సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ రోజు ప్రొటోకాల్ పాటించక పోవడంతో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.ఆలయ ఉత్సవాల నిర్వహణపై ఓ రెస్టారెంట్‌లో సమీక్ష నిర్వహించడంపై ఎమ్మెల్యేతో పాటు భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. స్వామి వారి కల్యాణోత్సవం రోజున మంత్రి కొండా సురేఖ కాన్వాయ్ మిస్ కావడం మరో వివాదమైంది. ఏఈవో వైరాగ్యం అంజయ్యపై ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం, ఆయనపై అధికారులు ఇతర ఆలయానికి పంపించడంతో ఆయన కోర్టును ఆశ్రయించడం వివాదాస్పదం అయ్యింది. ఇటీవల ఆలయ పునరుద్ధరణ కమిటీ సమావేశం అనంతరం మండల కేంద్రంలో దావత్ చేసుకుంటున్న సమయంలో గ్రామానికి చెందిన పలువురు వారిని ఫొటోలు తీసేందుకు యత్నించారు. ఆ సమయంలో ఆలయంలో విధులు నిర్వహించే తాత్కాలిక సిబ్బంది, ఫొటోలు తీసేందుకు వచ్చి వారు కొట్టుకోవడమే కాకుండా ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. తాజాగా కొందరు వ్యక్తులు పైరవీలతో దర్శనం పాసులు తీసుకువెళ్లి రూ.2500 విలువైన వాటిని రూ.1000కు విక్రయించి పట్టుబడడంతో కేసులు నమోదయ్యాయి. ఇటీవల జరిగిన పట్నం, లష్కర్, మూడో వారం సందర్భంగా తగిన ఏర్పాట్లు లేక, తాగునీటికి, స్నానం చేయడానికి, గదులు లభించక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల పేరిట ఇష్టారాజ్యంగా దర్శనం కల్పించడంతో సాధారణ భక్తులు క్యూలైన్లలో గంటల కొద్ది వేచి ఉండి దర్శనం చేసుకున్నారు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణను గాడిలో పెట్టేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని భక్తులు కోరుతున్నారు. ఇక నుంచి దర్శనాల పాస్‌ల జారీని కఠినతరం చేస్తామని ఆలయ ఈవో ఎ.బాలాజీ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్

- ఫైరింగ్‌తో సిబ్బందికి మరింత నైపుణ్యత: సీపీ అనురాధ
- పరిశీలించిన ఏఆర్ అడిషనల్ డీసీపీ, అడిషనల్ డీసీపీ అడ్మిన్

సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేటలో ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8: నంగునూరు మండలం రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ ఫైరింగ్‌లో పోలీస్ అధికారులకు 9 ఎంఎం పిస్టల్, రివాల్వర్, ఎస్ఎల్ఆర్ వెపన్స్‌తో ఫైరింగ్ చేయించారు. ఫైరింగ్ విధానాన్ని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి నైపుణ్యాల్లో శిక్షణనివ్వడంతో పాటు వ్యూహాత్మకంగా ఆలోచించడం నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించేందుకు, సమీపం నుంచి ప్రత్యర్థిని ఎదుర్కోవడం, ముష్కరులను నిరాయుధులను చేయడం, వ్యూహంతో తలపడడం, స్కిల్ డెవలప్‌మెంట్ అంశాల గురించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఫైరింగ్‌లో ఏసీపీలు సతీశ్, రమేశ్, సురేందర్‌రెడ్డి, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కొలువైన లక్ష్మీనర్సింహస్వామి

నేడు సింగరాయ జాతర

- భారీగా తరలిరానున్న భక్తులు

కోహెడ, ఫిబ్రవరి 8: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో గల గుట్టల్లో ప్రకృతి సోయగాల మధ్య పతాపరుద్ర సింగరాయ జాతర శుక్రవారం జరగనున్నది. ఏటా మాఘమ, పుష్యమి బహుళ అమావాస్య రోజున జాతర నిర్వహిస్తారు. రోజంతా ప్రకృతి అందాల మధ్య విహారయాత్రను తలపించేలా జాతర జరుగుతుంది. జాతరకు మహారాష్ట్రలోని ముంబై, భీవండి, చాందానాగ్‌పూర్, పూణె పట్టణాల నుంచే కాకుండా మెదక్, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి 2 లక్షల వరకు భక్తులు తరలి వస్తారు. జాతరకు రావడానికి సిద్దిపేట–హన్మకొండ రహదారి బస్వాపూర్, బద్దిపడగల స్టేజీల నుంచి, సిద్దిపేట–కరీంనగర్ రహదారి శనిగరం స్టేజీ నుంచి , కోహెడ మండల కేంద్రం నుంచి కూరెల్ల మీదుగా దారులు ఉన్నాయి. ఇక్కడ కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయం, పంచముఖ హనుమాన్, లైమ్‌స్టోన్‌తో చెక్కిన పంచముఖ బ్రహ్మ విగ్రహాలతో పాటు కొండపై గుహలో వెలసిన లక్ష్మీనర్సింహుల ఆలయం ఉంది. భక్తులు నదిలో స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. వచ్చే దారిలో గాజుల బండపై ఏర్పాటయ్యే దుకాణాల్లో తినుబండారాలు, ఆటబొమ్మలు కొనుగోలు చేస్తారు. జాతరలో మద్యం, మాంసాహారం ఆనవాళ్లు కనిపించవు. రాత్రయితే స్వామివారికి తలనొప్పి వస్తుందని భక్తులు ఇంటిదారి పడుతుంటారు.

- కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మరనున్న తెలంగాణ
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి
- జగదేవ్‌పూర్‌లో సీఎస్‌సీ సెంటర్, రైతు సేవా కేంద్రం ప్రారంభోత్సవం


జగదేవ్‌పూర్‌లో సీఎస్సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి

కేసీఆర్ హయాంలో పండుగలా వ్యవసాయం

జగదేవ్‌పూర్ ఫిబ్రవరి 8: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం పచ్చని పంటలు.. లక్షలాది టన్నుల ధాన్యం రాశులతో కళకళలాడిందని, కాంగ్రెస్ వచ్చిన 60 రోజుల్లోనే రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టిదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సీఎస్సీ సెంటర్‌తో పాటు అలిరాజ్‌పేటలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మండల నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని, రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు అందించారని తెలిపారు. సహకార సంఘాల ద్వారా అనేక మంది రైతులకు రుణాలు ఇచ్చారన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో పాటు 24గంటల ఉచిత కరెంటు అందించామన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని, ఎన్నికల్లో సమయంలో ప్రకటించిన రుణమాఫీ ఊసేలేదన్నారు. ఇప్పటికి రైతుబంధు డబ్బులు వేయలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాలతో 40శాతం వరి సాగు తగ్గిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ కవిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు యాదవరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, నాయకులు కరుణాకర్, మల్లేశ్, పీఏసీఎస్ డైరెక్టర్లు భూమయ్య యశ్వంత్‌రెడ్డి, భాగ్యలక్ష్మి వెంకటచలమారెడ్డి, చంద్రశేఖర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 8 : ఆపత్కాలంలో కార్యకర్తలు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గోదాల వెంకటేశ్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీలో సభ్యత్వం ఉండటంతో ప్రమాదబీమా నుంచి మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును మృతుడి భార్య సరితకు గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రమాదవశాత్తు మృతిచెందిన 325 కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల బీమా చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాణి సత్యనారాయణ, ఎంపీటీసీలు సంతోష్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నాయకులు ఎల్లన్న, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన విద్యార్థులు

మాట్లాడుతున్న ఉపాసన కామినేని

ప్రతిభకు హద్దులు లేవు

- కామినేని (కొణిదెల)ఉపాసన
- గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో మూడు రోజుల సాంకేతిక, సాంస్కృతిక (టెక్నో, కల్చరల్ ఫెస్ట్) పండుగ ప్రారంభం
- హాజరైన విద్యార్థులు, ప్రముఖులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: ప్రతిభకు హద్దులు లేవని అపోలో దవాఖానల సామాజిక సేవ (సీఎస్సార్) ఉపాధ్యక్షురాలు కామినేని(కొణిదెల) ఉపాసన అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో శివాజీ ఆడిటోరియంలో మూడు రోజుల సాంకేతిక, సాంస్కృతిక (టెక్నో, కల్చరల్ ఫెస్ట్) పండుగను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ.. ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చన్నారు. లింగ భేదం లేకుండా నేటితరం అన్నిరంగాల్లో రాణించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీ ప్రపంచంలో అత్యుత్తమమైన ప్రదర్శన ఇచ్చేందుకు తమను తాము ప్రతి ఒక్కరూ సన్నద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం వంశీకృష్ణ ఈ సందర్భంగా తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అందుబాటులో వనరులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అడ్డంకులను అధిగమిస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటామని తెలిపారు. ఎల్లక్ట్రికల్, మేనేజ్‌మెంట్ నేపథ్యం ఉన్న తాను సౌరశక్తి రంగంలో ఉన్న అభిరుచితో సౌర పైకప్పును రూపొందించి పేటెంట్ పొందానని చెప్పారు. ఎల్లక్ట్రికల్ వాహనాల రంగంలో ఉన్న ఆసక్తి మేరకు ఓ ఎల్లక్ట్రికల్ బైక్‌ను రూపొందించానని గుర్తుచేశారు. దేశం నుంచి ఆరు పేటెంట్లు పొందినట్లు కామినేని (కొణిదెల) ఉపాసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డరెక్టర్ వీఆర్ శాస్త్రి, ప్రమాణ 2024 అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ పి.త్రినాథరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

- 'మల్టీపర్పస్ సోలార్ కిసాన్ రక్షక్ అగ్రికల్చరల్ సిస్టం'ను రూపొందించిన కల్పన
- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కల్పన రూపొందించిన ప్రాజెక్టు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బంజారానగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కల్పన రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం లభించిందని మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి గురువారం తెలిపారు. సుస్థిర వ్యవసాయం అనే ఉప అంశంలో 'మల్టీపర్పస్ సోలార్ కిసాన్ రక్షక్ అగ్రికల్చరల్ సిస్టం' అనే ప్రాజెక్టును కల్పన తయారు చేసిందన్నారు. ప్రదర్శనను వర్చువల్ పద్ధతిలో నిర్వహించినట్లు తెలిపారు. కల్పనతో పాటు గైడ్ టీచర్‌ను కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్ అభినందించారు.

ఏడుపాయల వనదుర్గా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

మాఘస్నానాలకు ఏడుపాయల ముస్తాబు

- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు
- లక్షమంది భక్తులు వస్తారని అంచనా
- విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ
- 200 మంది పోలీసులతో బందోబస్తు

భక్తుల కోసం ఏర్పాటు చేసిన షవర్లు

పాపన్నపేట, ఫిబ్రవరి 8: మెదక్ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో మాఘఅమావాస్య జాతరకు ఆలయ పాలకవర్గం, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. జాతరకు సుమారు లక్ష మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉండగా, ఏడుపాయల్లో పుణ్యస్నానాలు చేయడానికి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. మంజీరా పాయల మధ్యలో వనదుర్గా భవానీ మాత స్వయంభూగా వెలవడంతో ఇక్కడ స్నానాలు చేస్తే సర్వపాపాలు తొలిగిపోతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల సౌకర్యార్థం ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల ఆలయం, చెక్‌డ్యాం, ఘనపూర్ ఆనకట్ట ప్రాంతాల్లో స్నానాలు చేయడానికి షవర్లతో పాటు మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సదుపాయాలు కల్పించారు. అమ్మవారి దర్శనానికి వీఐపీ, సాధారణ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సుమారు 200 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు చేపట్టారు. కాగా, స్నానాలకు అవసరమయ్యే నీటికోసం ఇటీవల సింగూరు ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు నీటిని సైతం వదిలారు.

మహిమాన్విత క్షేత్రం.. సాంద్రానంద ఆశ్రమం

ఈనెల 11 నుంచి ఆశ్రమ వార్షికోత్సవాలు

- 5 రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- తరలిరానున్న భక్తజనం, హాజరుకానున్న ప్రముఖులు

సిద్దిపేట జిల్లా మర్రిముచ్చాలలోని సాంద్రానంద ఆశ్రమం


కొలువై ఉన్న శ్రీ రాజారాజేశ్వరీదేవి, దత్తాత్రేయ స్వామి, దక్షిణామూర్తి, విద్యా హాయగ్రీవస్వామి

కొమురవెల్లి, ఫిబ్రవరి 8 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని సాంద్రానంద స్వామి ఆశ్రయం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్నది. ఆశ్రమ నిర్వాహకులు గౌరిభట్ల శ్రీనాథశర్మ ఆధ్వర్యంలో ఎన్నో యాగాలు,పూజలు, ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆశ్రమంలో త్రిమూర్తి స్వరూపంగా కొలువైన సాంద్రానంద స్వామి, సర్వ విద్యల ప్రదాత విద్యా హాయగ్రీవస్వామి, త్రిమూర్తి స్వరూపంగా దత్తాత్రేయ స్వామి, జ్ఞానమూర్తిగా దక్షిణామూర్తి, త్రిశక్తి స్వరూపంగా రాజరాజేశ్వరీదేవి కొలువైన ఉన్నారు. ఈనెల 11 ఆదివారం నుంచి 14 వరకు సాంద్రానంద ఘనస్వరూప నృసింహ స్వామి ఆశ్రమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా, భారీగా భక్తులు రానున్నారు. ఈ సందర్భంగా మహారుద్ర యాగం నిర్వహిస్తారు.

ఏటా నిర్వహిస్తాం..

మర్రిముచ్చాలలోని సాంద్రానంద ఆశ్రమంలో సాంద్రానంద ఘనస్వరూప నృసింహ వార్షికోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తాం. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. అన్నదానం నిర్వహిస్తాం. లోకకల్యాణం కోసం ఏటా స్వామివారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. ఏటా భక్తుల తాకిడి పెరుగుతున్నది.

– గౌరిభట్ల శ్రీనాథశర్మ,
ఆశ్రమ నిర్వాహకులు, మర్రిముచ్చాల